సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 18 । మే । 2023



పెన్నమ్మ తీరాన కన్నీటిధారలు

పుష్పగిరి వద్ద పెన్నా నదిలో మునిగి ఏనుగు బసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి (38) అనే ఇంజినీర్ బుధవారం మృతి చెందాడు. -8లో..



మెప్మా ఆర్పీలు నైపుణ్యం పెంచుకోవాలి

మెప్మా ఆర్పీలు నైపుణ్యం పెంచుకోవాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ సురేష్ రెడ్డి పేర్కొన్నారు. -8లో..



హజ్ యాత్రికులకు అండగా సీఎం జగన్

హజ్ యాత్రికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచిందని మైనార్టీ నాయకులు అహ్మద్‌బాషా అన్నారు. -8లో..

న్యూస్‌రీల్

నేడు 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ'

కడప కార్పొరేషన్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి గురువారం 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ 08562-242457 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చన్నారు.

డీఈఓ వెబ్‌సైట్‌లో పీజీటీ సీనియారిటీ జాబితా

వైవీయూ: ఉమ్మడి కడప జిల్లాలో హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో పీజీటీలుగా పనిచేసేందుకు సమ్మతి పత్రం ఇచ్చిన స్కూల్ అసిస్టెంట్‌ల (పీజీ అర్హత కలిగిన) తాత్కాలిక సీనియారిటీ జాబితాను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ వై. రాఘవరెడ్డి తెలిపారు. జాబితా డబ్లుడబ్లుడబ్లు.కడపడీఈఓ.ఇన్‌లో ఉంచినట్లు తెలిపారు. సీనియారిటీ జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు డీఈఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు. తర్వాత వచ్చిన వినతులు స్వీకరించబడవని తెలిపారు.

ఏపీ వాలీబాల్ జట్టు కోచ్‌గా గౌస్‌బాషా



కడప స్పోర్ట్స్: 45వ సబ్ జూనియర్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనే ఏపీ బాలబాలికల జట్టుకు కోచ్‌గా వైఎస్ఆర్ క్రీడాపాఠశాల వాలీబాల్ శిక్షకుడు ఎస్. గౌస్‌బాషాను నియమిస్తూ శాప్ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు రాజమండ్రిలో నిర్వహించనున్న ఏపీ వాలీబాల్ కోచింగ్ క్యాంపునకు ఈయన ముఖ్య శిక్షకుడుగా వ్యవహరించనున్నారు. అదే విధంగా ఈనెల 28 నుంచి జూన్ 1వ తేదీ వరకు పశ్చిమ బెంగాల్‌లోని చాదర్‌నగర్‌లో నిర్వహించే 45వ సబ్‌జూనియర్ నేషనల్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో క్రీడాకారులకు శిక్షకుడుగా వ్యవహరిస్తారు.

22న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా ప్రజా పరిషత్తు సర్వసభ్య సమావేశం ఈనెల 19వ తేదీ నిర్వహించాలని తొలుత నిర్ణయించామని, అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల ఈనెల 22వ తేదీకి మార్చినట్లు జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 9 గంటలకు సమావేశం కడప జెడ్పీ సమావేశ మందిరంలో ప్రారంభమవుతుందన్నారు. కనుక జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు హాజరు కావాలని కోరారు. అలాగే ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో రావాలన్నారు.

98 డీఎస్సీ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న డీఈఓ రాఘవరెడ్డి

వైవీయూ : ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లా పరిధిలో 1998 డీఎస్సీ ఎస్‌జీటీగా అర్హత సాధించి కాంట్రాక్ట్ బేసిస్ విధానంలో మినిమం టైంస్కేల్ కింద పనిచేసేందుకు అర్హత కలిగిన ఉపాధ్యాయులకు బుధవారం సర్టిఫికెట్లు వెరిఫికేషన్ నిర్వహించారు. కడప నగరంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈఓ వై. రాఘవరెడ్డి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 14 నాన్ జాయినింగ్ పోస్టులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఏడీ మునీర్‌ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

కేసీ కెనాల్‌కు సాగునీరు విడుదల

చాపాడు: రైతుల కోరిక మేరకు చివరి ఆయకట్టులో పైర్లకు చివరి తడులు అందించాలనే ఉద్దేశ్యంతో కేసీ కాలువకు తిరిగి సాగునీరు విడుదల చేసినట్లు కేసీ కెనాల్ డీఈఈ బ్రహ్మారెడ్డి తెలిపారు. గతేడాది ఖరీఫ్‌లో మొదలైన సాగునీరు ఈ ఏడాది రబీలో సాగు చేసిన పంటలు పూర్తయ్యే వరకూ ఏప్రెల్ నెల అంతా సాగునీరు విడుదల చేశారు. మే నెలలో నీరు ఆపగా కేసీ కాలువల్లో పలు చోట్ల ఉపాధి హామీ పథకం కింద పూడిక తీత పనులు సైతం చేశారు. అయితే చాపాడు, ఖాజీపేట మండలాల్లోని చివరి ఆయకట్టులో సాగైన మినుము, వేరుశనగ, నువ్వు ఇంకా పలు రకాలైన పంటలు పంట దశలో ఉన్నాయి. ఈ క్రమంలో రైతుల కోరిక మేరకూ పైర్లకు చివరి తడి అందించేందుకు నీరు విడుదల చేశామని రెండు మూడు రోజుల్లో నీటి నిలుపుదల చేస్తామని కేసీ కెనాల్ డీఈఈ బ్రహ్మారెడ్డి తెలిపారు.

ఎండ ప్రచండం



జిల్లాలో 17వ తేదీన గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాల వివరాలు ఇలా....

మండలం	ప్రాంతం	ఉష్ణోగ్రత డిగ్రీల్లో
కడప	కడప నగరం	44.5
వల్లూరు	వల్లూరు	44.4
పోరుమామిళ్ల	కొ్రపాటుపల్లె	44.0
సిద్దవటం	సిద్దవటం	43.7
కలసపాడు	కలసపాడు	43.6
ముద్దనూరు	ఉప్పలూరు	43.6
సింహాద్రిపురం	సింహాద్రిపురం	43.5
జమ్మలమడుగు	జమ్మలమడుగు	43.2
కొండాపురం	పొట్టిపాడు	43.1
కొండాపురం	అనంతపురం	43.0
పొద్దుటూరు	చౌడూరు	43.0
రాజుపాలెం	రాజుపాలెం	42.9
బద్వేల్	కొంగలవీడు	42.9
బికోడూరు	పాయలకుంట	42.8
అట్లూరు	అట్లూరు	42.7
సింహాద్రిపురం	సుంకేసుల	42.7
పెద్దుముడియం	పెద్దపసుపుల	42.7
వీఎన్‌పల్లె	పాలగిరి	42.5
యర్రగుంట్ల	యర్రగుంట్ల	42.4
కమలాపురం	కమలాపురం	42.4
ఒంటిమిట్ట	ఒంటిమిట్ట	42.4
సికెదిన్నె	మూలవంక	42.2
పెద్దముడియం	దిగువకల్వట్ల	42.2
పెండ్లిమర్రి	వేమనాపురం	42.0
చెన్నూరు	రామనపల్లె	42.0
తొండూరు	సంతకొవ్వూరు	42.0



నిర్మానుష్యంగా ఉన్న కడప నగరంలోని కలెక్టర్ కార్యాలయం ప్రధాన రహదారి

- కడప నగరంలో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- ఉక్కపోతతో అల్లాడిపోతున్న జనం

కడప అగ్రికల్చర్: జిల్లాలో సూర్య ప్రతాపం కొనసాగుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా బుధవారం జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ఎండల ప్రభావం జిల్లాలో కొద్ది రోజులు కొనసాగనున్నట్లు కృషి విజ్ఞానకేంద్ర వాతావరణ శాస్త్రవేత్త స్వామి చైతన్య తెలిపారు. వేడితో కూడిన అసౌకర్యమైన వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా 2 నుంచి 4 డిగ్రీలు పెరిగిందని తెలిపారు. ప్రజలంతా ఉదయం 11 గంటలకంతా బయట ప్రాంతాల్లో పనులను చూసుకుని ఇళ్లకు చేరుకుని ఎండ తీవ్రత నుంచి తప్పించుకోవాలన్నారు. అలాగే వ్యవసాయ కూలీలు, వ్యవసాయ పనులు చేసే రైతులు కూడా వీలైనంత త్వరగా ఎండబారిన పడకుండా ఇళ్లకు చేరుకోవాలని తెలిపారు. ఎండలకు ఏదైనా తేడా అనిపిస్తే తక్షణం వైద్యులను సంప్రదించాలని తెలిపారు. జిల్లా కేంద్రమైన కడపలో మునుపెన్నడూ లేని విధంగా 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది.



ఎండ నుంచి రక్షణగా ఇలా..



చిన్న చెట్టు నీడన సేదదీరుతున్న ప్రజలు

ఎన్నాళ్లో వేచిన ఉదయం

- వైద్య ఆరోగ్య శాఖలో పరస్పర బదిలీలకు పచ్చ జెండా
- ఐదేళ్ల తరువాత అవకాశం



వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం, కడప

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ వ్యవస్థ చాలా పెద్దది. ఇందులో అన్ని కేడర్‌లకు చెందిన సిబ్బంది సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉద్యోగ నియామకాలు.. సీనియారిటీ ప్రకారం పదోన్నతులు, సాధారణ బదిలీలు జరుగుతుంటాయి. పరస్పర (మ్యూచువల్) బదిలీలు మాత్రం తరచుగా జరుగుతుంటాయి. అయితే దాదాపు నాలుగైదేళ్ల తరువాత ప్రభుత్వం ఉద్యోగులకు వెసులుబాటు కల్పించింది. పరస్పర బదిలీలకు పచ్చ జెండా ఊపింది.

11 కేడర్‌లకు అవకాశం..

ఇందుకు సంబంధించి ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ క్రిష్ణబాబు ఈ నెల 16వ తేదీన జీఓ ఆర్టీ నంబరు 371 ని జారీ చేశారు. స్టాఫ్ నర్స్, హెడ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2, ఫార్మాసిస్ట్ గ్రేడ్-2, ఎంపీహెచ్‌ఎస్ (మేల్), ఎంపీహెచ్‌ఎస్ (ఫిమేల్), పీహెచ్‌ఎన్ (ఎన్‌టీ) ఎంపీహెచ్‌ఈఓ, సీహెచ్‌ఓ (మేల్), సీహెచ్‌ఓ (ఫిమేల్), హెల్త్ ఎడ్యుకేటర్ మొత్తం 11 కేడర్‌లకు చెందిన ఉద్యోగులకు పరస్పర బదిలీలకు వెసులుబాటు కల్పించారు. ఈ అవకాశం వైద్య ఆరోగ్య శాఖ (జోన్-4) రాయలసీమ జిల్లాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు వర్తిస్తుంది.

ఇద్దరు ఉద్యోగుల అంగీకారంతోనే...

నిబంధనల ప్రకారం వివిధ ప్రాంతాల్లో విధులను నిర్వహిస్తూ కేవలం ఒకే కేడర్‌కు చెందిన ఇద్దరు ఉద్యోగులు పరస్పర అంగీకారంతోనే 'మ్యూచువల్' బదిలీలకు అర్హులు. అర్హులైన వారు 15 రోజుల్లో సిబ్బంది ఏ శాఖ పరిధికి చెందిన వారైతే ఆ శాఖకు అంటే డైరెక్టర్ ఆఫ్ హెల్త్, వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం కడప, జిల్లా వైద్య ఆరోగ్య శాఖలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వలన ప్రధానంగా అధిక సంఖ్యలో ఉండే స్టాఫ్ నర్స్, హెడ్ నర్స్‌లకు ఎక్కువగా లబ్ధి చేకూరే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. ప్రభుత్వ నిర్ణయం పట్ల ఆ శాఖ ఉద్యోగులు ఆనందంలో ఉన్నారు.

గండికోటలో అధికారుల పర్యటన



గండికోటలో పర్యటించిన అహమ్మదాబాద్ కన్సల్టెన్సీ ప్రతినిధులు, అధికారులు

జమ్మలమడుగు: ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటను అభివృద్ధి చేయడం కోసం అహమ్మదాబాద్‌కు చెందిన ఐఎస్‌ఐ డిజైన్ స్టూడియో అనే కంపెనీ ప్రతినిధులు, అధికారులతో కలసి గండికోటలో పర్యటించారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మల్‌రెడ్డి, ఆర్డీఓ జి.శ్రీనివాసులు తదితరులు కన్సల్టెన్సీ ప్రతినిధులైన హర్షగోయాల్ తదితరులతో కలిసి గండికోట టూరిజం స్పాట్‌లను గుర్తించడం కోసం పర్యటించారు.

ఈ సందర్భంగా టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాట్లాడుతూ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్వదేశీ దర్శన్ పేరుతో పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయడం కోసం కన్సల్టెన్సీల ప్రతినిధులను టెండర్‌లకు ఆహ్వానిస్తోందన్నారు. మన రాష్ట్రంలో గండికోట, లంబసింగి అరకు ప్రాంతాలు స్వదేశీదర్శన్ కింద ఎంపికైనట్లు తెలిపారు. గండికోటను పర్యాటకంగా తీర్చిదిద్దడం కోసం గుజరాత్ రాష్ట్రం అహమ్మదాబాద్‌కు చెందిన టూరిజం కన్సల్టెన్సీ ఐఎస్‌ఐ డిజైన్ స్టూడియో కంపెనీకి అప్పగించడం జరిగిందన్నారు. గండికోట టూరిజం డెవలప్‌మెంట్ చేయడం కోసం ఆ సంస్థ ప్రతినిధులు గండికోటలో పర్యటించారన్నారు. ఈసందర్భంగా వారు కోట లోపల, గండికోట పెన్నాలోయ తదితర ప్రాంతాలలో ఎటువంటి అభివృద్ధి చేపట్టాలని, రిసార్టులను ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయాలపై స్థలాలను పరిశీలించారన్నారు. మొత్తం ప్రాజెక్టుకు సంబంధించిన రిపోర్టులను తయారు చేసి జూన్ 26వ తేదీన తిరిగి గండికోట డెవలప్‌మెంట్‌పై డాక్యుమెంటరీ తయారు చేసి కడపలో ప్రదర్శన చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ విజయ రామరాజు చూసిన తర్వాత ఏమైనా మార్పులు చేర్పులను చేసి జూలై 7వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్ద ప్రజెంటేషన్ ఇస్తామన్నారు. స్వదేశీ దర్శన్ కింద గండికోటను రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి చేయడం కోసం పక్కా ప్రణాళికలతో ముందుకు వెళుతోందన్నారు. గండికోటలో థీంపార్కు, మ్యూజియం పార్కు, అడ్వెంచర్స్ అకాడమి వంటివి ఏర్పాటు చేయడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు.

సూక్ష్మ నీటిసాగు పరికరాలపై అవగాహన



మాట్లాడుతున్న పీడీ రవీంద్రనాథరెడ్డి

కడప అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి 10,500 హెక్టార్లకు సూక్ష్మ నీటి సాగు పరికరాల కేటాయింపు జిల్లాకు లక్ష్యంగా పెట్టుకున్నామని ఏపీ ఎంఐపి పీడీ రవీంద్రనాథరెడ్డి తెలిపారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ సూక్ష్మనీటిసాగు పథకం పీడీ కార్యాలయంలో సిబ్బంది, జిల్లా కంపెనీ ప్రతినిధులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ఆర్‌బీకే ద్వారా సూక్ష్మసాగు పరికరాల కోసం రిజిస్ట్రేషన్ చేయించునే విషయంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ మురళీమోహన్‌రెడ్డి , కార్యాలయ సిబ్బంది, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాలు జరిగేలా చూడాలి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు జరిగేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాదర్‌వల్లి ఆదేశించారు. బుధవారం కడప కలెక్టరేట్‌లో హెల్త్ ఇండికేటర్స్‌పై ప్రోగ్రాం అధికారులు, మండల నోడల్ ఆఫీసర్లు, పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రసవాలు ఆరోగ్య కేంద్రాల్లో చేయకపోవడం వల్ల ర్యాంకింగ్‌లో జిల్లాకు సీ గ్రేడ్ వచ్చిందని తెలిపారు. కనుక ప్రసవాలు 100 శాతం పీహెచ్‌సీల్లో జరిగేలా చూడాలని కోరారు. ప్రతిరోజూ హైరిస్క్ గర్భవతులకు డాక్టర్లు ఫోన్‌కాల్ చేసి అవసరమైన సూచనలు ఇవ్వాలన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌లో గర్భవతులకు హెచ్‌బీ టెస్ట్ చేయించాలని, గర్భవతులను, పుట్టిన ప్రతిబిడ్డను, వారికి అందించే వ్యాధి నిరోధక టీకాల వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ ఉమామహేశ్వర కుమార్, శాంతికళ, చంద్రహాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగాల ప్రజల చిరకాల కోరిక నెరవేరింది

- పెద్దచెరువుకు నీటి విడుదల
- ఇది జీవితంలో గుర్తుండిపోయే రోజు
- ప్రజలతోపాటు నేనూ ఎంతో సంతోషపడుతున్నా
- సీఎం జగనన్నవల్లే సాకారమైంది
- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎంపీపీ అమృత, జెడ్పీటీసీ పుష్ప తదితరులు



చెరువులోకి పరుగులు తీస్తున్న నీటిని పరిశీలిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

లింగాల : లింగాల గ్రామ ప్రజల చిరకాల కోరిక సీఎం జగనన్న వల్లే నెరవేరింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే లింగాల పెద్ద చెరువుకు, వనంబావి కొత్త చెరువుకు సుమారు రూ.4 కోట్ల వ్యయంతో రెండు ఎత్తిపోతల పథకాలను మంజూరు చేశారు. దీంతో రూ.2 కోట్ల వ్యయంతో పూర్తి చేసిన ఎత్తిపోతల పథకం ద్వారా లింగాల పెద్ద చెరువుకు స్విచాన్ చేసి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నీటిని తరలింపజేశారు. బుధవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగపు రాష్ట్ర కన్వీనర్ వైఎస్ అభిషేక్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలు బుధవారం లింగాల పెద్ద చెరువుకు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ లింగాల గ్రామ ప్రజలు తీవ్ర నీటి ఎద్దడితో వందల అడుగుల లోతు బోర్లు వేసినా నీరు అందని పరిస్థితి ఉండేదని.. ఇక్కడ అరటి సాగు చేసి జీవనం సాగించుకునేవారు.. అలాంటి పరిస్థితి నుంచి రైతులకు సాగునీరు అందించాలని జగనన్న ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలను మంజూరు చేసిందన్నారు. దీంతో లింగాల ప్రజల చిరకాల కోరికను జగనన్న సాకారం చేశారని ఎంపీ పేర్కొన్నారు. అదేవిధంగా లింగాల కొత్త చెరువుకు మరో రూ.2కోట్లతో ఎత్తిపోతల పథకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. వచ్చేనెల 10వ తేదీలోగా ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి నీటిని తరలిస్తామన్నారు. అదే విధంగా జగనన్న ప్రభుత్వం రైతులపట్ల, రైతులకు సాగునీరు అందించడంపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు.

- గండికోటలో జగనన్న ప్రభుత్వం రాకముందు 8 టీఎంసీలకు మించి నీటిని నిల్వ ఉంచలేని పరిస్థితి ఉండేదని.. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగేళ్లలో రూ.900 కోట్ల వ్యయం చేసి ప్రస్తుతం 26 టీఎంసీల నీటిని నిల్వ ఉంచుకుంటున్నామన్నారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో గతంలో 5 టీఎంసీల కన్నా నీరు నిల్వ ఉంచుకునే పరిస్థితి లేదని.. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.280కోట్లను నిర్వాసిత గ్రామాల ప్రజలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించి ప్రస్తుతం 10టీఎంసీల నీటిని నిల్వ చేసుకుంటున్నామన్నారు. జిల్లాలోని గండికోట, చిత్రావతి, పైడిపాలెం ప్రాజెక్టులకు నీరు పూర్తిస్థాయిలో నిల్వ చేసుకున్నామన్నారు. గండికోట, చిత్రావతి రిజర్వాయర్లలో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ ఉంచడం కోసం జగనన్న ప్రభుత్వం నాలుగేళ్లలో రూ.1200 కోట్ల నుంచి రూ.1300 కోట్లు వ్యయం చేసిందన్నారు.

22 రోజుల్లో పూర్తిస్థాయిలో చెరువుకు నీరు :

ప్రస్తుతం లింగాల కుడికాలువ వద్ద నుంచి లింగాల పెద్ద చెరువుకు 22రోజుల్లో పూర్తిస్థాయిలో నీటిని నింపుతామని నీటిపారుదల శాఖ ఎస్ఈ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. 220హెచ్‌పి రెండు మోటార్లతో 1.32కి.మీ పొడవునా పైపులైన్ ద్వారా రోజుకు 16క్యూసెక్కుల చొప్పున చెరువుకు నీటిని తరలిస్తున్నామన్నారు. చెరువు సామర్థ్యాన్ని 19.39ఎంసీఎఫ్‌టీ ఉందని ఆయన తెలిపారు.

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి ఘన స్వాగతం :

బుధవారం లింగాల ఎత్తిపోతల పథకం ప్రారంభించేందుకు వచ్చిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని వేద పండితులు పూర్ణకుంభంతో ఆహ్వానించారు. ఎత్తిపోతల పథకం పంప్ హౌస్‌ను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎంపీపీ అమృత, జెడ్పీటీసీ పుష్ప రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వైఎస్ అభిషేక్ రెడ్డి, ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలతో కలిసి ఆయన మోటార్ల స్విచాన్ చేసి ఎత్తిపోతల పథకం భారీ మోటార్లను ఆన్ చేశారు. అనంతరం పైపులైన్ ద్వారా చెరువులోకి పరుగులు తీస్తున్న నీటి వద్ద ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డి, యూత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బాబురెడ్డి, వైఎస్ఆర్‌సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్లు సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, లింగాల, సింహాద్రిపురం మండలాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్లు కర్నా రమేష్‌కుమార్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, నీటిపారుదల శాఖ సీఈ చిన్న రామునాయక్, పీబీసీ ఈఈ రాజశేఖర్, జేఈలు పాల్గొన్నారు.

ఆర్టీపీపీ సీఈగా నాగరాజు



ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీపీ) చీఫ్ ఇంజనీర్‌గా నాగరాజును నియమించారు. ఏపీజెన్‌కో యాజమాన్యం సాధారణ బదిలీలలో భాగంగా ఇక్కడ సీఈగా పనిచేస్తున్న మురళీకృష్ణను విద్యుత్ సౌధకు బదిలీ చేసింది. నెల్లూరు ఆర్‌పీపీ కేంద్రంలో సీఈగా పనిచేస్తున్న నాగరాజును ఇక్కడ సీఈగా నియమించారు. త్వరలో నాగరాజు పదవీ బాధ్యతలు తీసుకోనున్నట్లు సమాచారం.

మూడో రోజు ఈఏపీసెట్ ప్రశాంతం

కడప ఎడ్యుకేషన్: ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ ప్రవేశాల కోసం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఈఏపీసెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఇందులో భాగంగా మూడవరోజు బుధవారం ఎంపీసీ విద్యార్థులకు నిర్వహించిన ఈఏపీసెట్ పరీక్షను జిల్లాలోని 9 పరీక్షా కేంద్రాలలో నిర్వహించారు. ఇందులో ఉదయం సెషన్‌కు సంబంధించి 1484 మంది విద్యార్థులకుగాను 1385 మంది హాజరై 93.33 శాతం హాజరు నమోదయింది. అలాగే మధ్యాహ్నం సెషన్‌కు సంబంధించి 1484 మందికిగాను 1402 మంది హాజరై 94.47 శాతం హాజరు నమోదయింది. రెండు సెషన్స్‌కు సంబంధించి 2968 మందికిగాను 2787 హాజరుకాగా 93.90 హాజరు నమోదయింది.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ : జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద పీజీ/పీహెచ్‌డీ/ఎంబీబీఎస్ కోర్సులను అభ్యసించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి 2023–24 విద్యాసంవత్సరానికి గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ సంయుక్త సంచాలకులు జయప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లోని జ్ఞానభూమి.ఏపీ.జీఓవి.ఇన్ లో ఉంచిన వెబ్‌సైట్ లింక్ ద్వారా దరఖాస్తులను నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకోసం జూన్ 10వ తేదీ చివరితేదీగా పేర్కొన్నారు.

సబ్జెక్టుల వివరాలు : అకౌంటింగ్ మరియు ఫైనాన్స్, అగ్రికల్చర్ మరియు ఫార్మసి, ఆర్కిటెక్చర్ అండ్ బిల్ట్ ఎన్విరాన్‌మెంట్, ఆర్ట్ అండ్ డిజైన్, ఆర్ట్ అండ్ హ్యుమానిటీస్, బయోలాజికల్ సైన్స్, బిజినెస్, కెమిస్ట్రీ, కమ్యూనికేషన్ అండ్ మీడియా స్ట్రాటజీ, కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్ అండ్ ఎకనోమెట్రిక్స్, ఎడ్యుకేషన అండ్ ట్రెనింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, ఇంజినీరింగ్, ఇంజినీరింగ్– మినరల్, మైనింగ్, ఇంజినీరింగ్–పెట్రోలియం, హాస్పిటాలిటీ అండ్ లేసిసుర్ మేనేజ్‌మెంట్, లా, మెడిసిన్, న్యాచురల్ సైన్స్, ఫిజిక్స్ అండ్ ఆస్ట్రానమీ.

అనారోగ్యంతో ఆత్మహత్య

కడప అర్బన్ : కడపలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోచన్న వెంకటేశ్వరరెడ్డి (45) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఓ ప్రైవేట్ సంస్థలో టెక్నీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం రాత్రి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

తాయత్తులు కట్టి రూ.10లక్షలకు టోకరా

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ వడ్డిపల్లిలో ఉంటున్న కనకమ్మ అనే మహిళ కావమ్మ దేవత పడుతుందని ఆశ చూపి తాయత్తులు కట్టి 10 లక్షలు వరకు బంగారు, నగదు తీసుకొని మోసం చేసిందని బుధవారం జాకీర్ పోలీసులకు పిర్యాదు చేసాడు. డబ్బులడిగితే ఆమె భర్త శివయ్య, కుమారులు శ్రీను, సుబ్రమణ్యంలు చంపేస్తామని బెదిరిస్తున్నట్లు తెలిపారు. విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్సై మోహన్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.

పెన్నమ్మ తీరాన కన్నీటి ధారలు


మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు


సురక్షితంగా బయటపడిన పిల్లలు. వారిని కాపాడిన వెంకటరత్నం

- నీటిలో మునిగి ఇంజినీరు మృతి
- సురక్షితంగా బయటపడిన ఇద్దరు పిల్లలు

వల్లూరు : పుణ్య క్షేత్రమైన పుష్పగిరి వద్ద పెన్నా నది నీటిలో మునిగి ఏనుగు బసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి (38) అనే ఇంజినీర్ బుధవారం మృతి చెందాడు. వల్లూరు పోలీసుల కథనం మేరకు వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్లకు చెందిన శ్రీకాంత్ రెడ్డి హిందూస్థాన్ లీవర్ కంపెనీలో ఇంజినీర్‌గా పని చేస్తూ ప్రస్తుతం రాజమండ్రిలో నివాసం ఉంటున్నాడు. వేసవి సెలవులు కావడంతో కుటుంబంతో కలిసి ఎర్రగుంట్లకు వచ్చారు. బుధవారం ఉదయం తన భార్య శ్రావణి, ఇద్దరు కుమార్తెలు, అక్క కృష్ణ వేణి, వారి పిల్లలు కౌసిక్ రెడ్డి (11), తనిష్కరెడ్డి (14), చెల్లెలు సునీతలతో కలిసి దైవ దర్శనం కోసం పుష్పగిరికి వచ్చారు. అందరూ కలిసి పెన్నా నదిలో స్నానాలకు దిగారు. శ్రీకాంత్ రెడ్డి తన మేనళ్లులైన కౌసిక్ రెడ్డి, తనిష్కరెడ్డిలతో కలిసి లోతు ఎక్కువగా ఉన్న ప్రదేశంలోకి వెళ్లారు. ఈ క్రమంలో శ్రీకాంత్ రెడ్డి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి పోయాడు. కొద్ది సేపటికి ఊపిరాడక మృతి చెందాడు.

ఇద్దరు పిల్లలను కాపాడిన రత్నం

కాగా శ్రీకాంత్ రెడ్డితో బాటు నదిలో అతనికి అతి సమీపంలో ఈత ఆడుతున్న కౌసిక్ రెడ్డి, తనిష్కరెడ్డిలు సైతం నీట మునిగి ప్రమాదంలో చిక్కుకున్నారు. అదే సమయానికి పుష్పగిరి కొండపైన విధి నిర్వహణలో ఉన్న పురావస్తు శాఖకు చెందిన వెంకట రత్నం గమనించి పరుగున వచ్చి నదిలోకి దూకారు. సాహసంతో పిల్లల వద్దకు చేరుకుని ఇద్దరినీ ఒకే సారి తన వీపున వేసుకుని అతి కష్టం మీద వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. తిరిగి నదిలోకి వెళ్లి శ్రీకాంత్ రెడ్డి కోసం వెదికారు. అప్పటికే నీరు తాగి ఊపిరాడక మృతి చెందిన అతని మృతదేహాన్ని వెంకట రత్నం బయటకు తీసుకొచ్చారు. ప్రాణాలకు తెగించి ఇద్దరు పిల్లలను కాపాడిన వెంకట రత్నంను పలువురు ప్రశంసించారు. కాగా వెంకట రత్నం సురక్షితంగా బయటకు తీసిన పిల్లలు కౌసిక్ రెడ్డి, తనిష్కరెడ్డిలు అన్నమయ్య జిల్లా పీలేరు సీఐ మోహన్‌రెడ్డి తనయులుగా తెలిసింది. తల్లి కృష్ణవేణితో కలిసి మేనమామ శ్రీకాంత్ రెడ్డి వద్దకు వచ్చిన వారు నదిలో స్నానం చేస్తూ ప్రమాదంలో చిక్కుకున్నారు.

మిన్నంటిన ఆక్రందనలు

దైవ దర్శనానికి వచ్చి తమ కళ్లెదుటే శ్రీకాంత్‌రెడ్డి మృతి చెందడంతో అతని భార్య, అక్క, చెల్లెళ్ల ఆక్రందనలు మిన్నంటాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ పెద్ద ఓబన్న సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించి పోస్ట్ మార్టం అనతరం బంధువులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మెప్మా ఆర్పీలు నైపుణ్యం పెంచుకోవాలి

కడప కార్పొరేషన్ : మహిళా సంఘాల బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న మెప్మా ఆర్పీలు ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ ద్వారా.. నైపుణ్యతను మరింత మెరుగు పరుచుకోవాలి మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.సురేష్ రెడ్డి పేర్కొన్నారు.పట్టణ పేదరిక నిర్మూల సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో బుధవారం కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 100 మంది స్లం లెవెల్ సమైక్యల రీసోర్స్ పర్సన్స్‌కు స్థానిక స్మిత్ రోడ్డులోని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థలో జిల్లా స్థాయి రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మెప్మా పీడీ వై. సురేష్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టంగా చేపడుతున్న నవరత్నాల్లోని వైయస్సార్ ఆసరా, వైయస్సార్ సున్నా వడ్డీ, వైయస్సార్ చేయూత , టిడ్కో హౌసెస్ మరియు జగనన్న కాలనీలకు సంబంధించి విధివిధానాలను తెలుసుకుని లబ్దిదారులైన సంఘ సభ్యులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చేయాలన్నారు. అలాగే మెప్మా కార్యక్రమాలపై సంఘ సభ్యులకు అవగాహన కల్పించి సంస్థ ఉన్నతికి పాటుపడాలని తెలియజేశారు. మెప్మా అధికారులు ఎప్రాయిమ్, గోపీనాథ్ డిఆర్‌పీలు జోసెఫ్, చంద్ర, శోభ మరియు వంద సమైక్యల నుండి ఆర్పీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మెప్మా పీడీ వై. సురేష్ రెడ్డి

నాణ్యత ప్రమాణాలు పరిశీలించాలి

కడప అగ్రికల్చర్ : రైతులకు సంబంధించిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందల నాణ్యత ప్రమాణాల విషయంలో వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ కార్యాలయ అడిషనల్ డైరెక్టర్ వినయ్‌చంద్, జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కృష్ణదాస్, డీడీఏ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం కడప కలెక్టరేట్‌లో కడప, అన్నమయ్య జిల్లాల వ్యవసాయ అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుముందులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, కడప జిల్లా ఇన్‌చార్జి అగ్రికల్చర్ ఆఫీసర్ రాధాదేవి తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు అండగా సీఎం జగన్


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న అహ్మద్‌బాషా తదితరులు

కడప కార్పొరేషన్ : హజ్ యాత్రికులకు అదనపు భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవడం అభినందనీయమని మైనార్టీ నాయకులు, హరూన్ గ్రూప్ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ అహ్మద్ బాషా అన్నారు. బుధవారం డిప్యూటీ సీఎం అంజద్ బాష క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి ముస్లిం సోదరులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అహ్మద్‌బాషా మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళ్లే వారికి విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ ద్వారా ఒక్కొక్కరికి రూ. 3.80 లక్షల రూపాయలు ఖర్చవుతుందన్నారు. ఈ ధరను సెంట్రల్ హజ్ కమిటీ, కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీనివల్ల హజ్‌యాత్రికులు సుమారు రూ.80 వేలు అదనంగా చెల్లించాల్సి రావడంతో వారంతా ఆందోళన చెందారన్నారు. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, ఆయన ద్వారా కేంద్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఇతర అధికారులను ఎంపీ మిథున్‌రెడ్డితో కలిసి కలవడం జరిగిందన్నారు. సాంకేతిక కారణాల వల్ల కేంద్ర ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో మరోసారి సీఎం దృష్టికి తీసుకుపోయి హజ్‌యాత్రికులపై అదనపు భారం పడకుండా చర్యలు తీసుకున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్ హజ్‌యాత్రికులకు ఒక్కొక్కరికి రూ.80 వేలు ప్రభుత్వమే భరించేలా ఉత్తర్వులు ఇచ్చారని, ఈ మేరకు సుమారు రూ.14.15కోట్లు ఆర్థిక సాయం చేశారన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాల్లోనూ ఇదేవిధంగా ధరలు ఉన్నాయని, ఒక్క మన రాష్ట్రంలో మాత్రమే ముస్లిం మైనార్టీలకు హజ్ యాత్రకు ఆర్థిక సాయం చేయడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని ముస్లింలు గుర్తించాలని, ముస్లిం మైనార్టీలకు అండగా నిలుస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎండీ జహీర్, కార్పొరేటర్లు మగ్బూల్‌బాషా, అరీఫుల్లా బాషా, అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

సాధారణ బదిలీలతో ఉద్యోగులకు ఊరట


బి. శ్రీనివాసులు


జీవన్ చంద్రశేఖర్‌రావు

కడప సెవెన్‌రోడ్స్ : సాధారణ బదిలీలు ఉద్యోగులకు ఎంతో ఊరటనిస్తాయని ఎన్‌జీవో సంఘం అధ్యక్షుడు బి. శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చు. క్లియర్ వేకేన్సీ ఉంటే రెండు సంవత్సరాలు పనిచేసిన వారికి కూడా బదిలీ అయ్యే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్చి 31వ తేదీలోపు ఇస్తానన్న హామీ మేరకు ఉద్యోగులకు జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలు ఇచ్చారు. ఒక డీఏ కూడా ప్రకటించారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌లోపు సరెండర్ లీవులు కూడా క్లియర్ చేస్తానని చెప్పారు. ఇప్పుడు ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

సంతోషదాయకం

నిషేధాన్ని ఎత్తివేస్తూ ప్రభుత్వ ఉద్యోగులకు సాధారణ బదిలీల అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించడం సంతోషదాయకమని రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జీవన్ చంద్రశేఖర్‌రావు అన్నారు. చాలామంది ఉద్యోగులు పిల్లల చదువుల కోసం, వైద్య అవసరాల కోసం అనుకూలమైన ప్రాంతాలకు బదిలీ కావాలని కోరుకుంటారు. ఇప్పుడు బదిలీలకు పచ్చజెండా ఊపడంతో ఉద్యోగులకు ఊరట కల్గిస్తోంది. సాధారణ బదిలీలను తాము ఆహ్వానిస్తున్నామని అన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ


కేకేఎన్ అన్బురాజన్, జిల్లా ఎస్పీ

కడప అర్బన్ : సైబర్ నేరగాళ్లు కొత్త ఆలోచనలతో ప్రజలను మోసం చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సూచించారు. ఇటీవలి కాలంలో ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు ప్రజలు గూగుల్ సెర్చ్ ఇంజిన్‌లో ఆయా కంపెనీల స్కూటర్ల వివరాల కోసం వెతుకుతున్నారు. దీనిని ఆసరగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు తెగబడుతున్నారని ఎస్పీ తెలిపారు. నకిలీ వెబ్‌సైట్లు, ఫోన్ నెంబర్ల ద్వారా అమాయక ప్రజలను మోసం చేస్తున్నారన్నారు.

మోసం చేస్తారిలా..

ఆన్‌లైన్‌లో ఓ వ్యక్తి ఇటీవల ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్ కొనుగోలు చేసేందుకు గూగుల్‌లో వెతకగా కంపెనీ ప్రతినిధి పేరుతో ఒక ఫోన్ నెంబర్ కనిపించింది. సదరు వ్యక్తితో మాట్లాడగా ఆధార్, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్ సైజ్‌ఫోటో, మెయిల్ ఐడీ వాట్సాప్ ద్వారా తీసుకుని, రూ. లక్ష కడితే స్కూటర్ పంపిస్తామనీ మాయమాటలు చెప్పారు. అతను మాయమాటలు నమ్మి రూ. లక్ష తొలివిడతగా చెల్లించాడని, మరుసటి రోజున మళ్లీ ఫోన్ చేసి రూ. 20 వేలు డెలివరీ చార్జీలు చెల్లించాలనీ చెప్పి బాధితుడి నుంచి మరోసారి డబ్బులను వేయించుకున్నారన్నారు. తరువాత బాధితుడు తాను మోసపోయినట్లుగా గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడనీ ఎస్పీ వివరించారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి


సామాజిక తనిఖీలో భాగంగా రికార్డులను పరిశీలిస్తున్న పీడీ యదుభూషణ్‌రెడ్డి

దువ్వూరు : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీల సంఖ్యను పెంచాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు యదుభూషణ్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన దువ్వూరులోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు రూ.275 కూలి తగ్గకుండా పనులు కల్పించాలన్నారు. ఎప్పటికప్పుడు మస్టర్లలో కూలీల సంఖ్య, వారు చేసిన పనులను పొందుపరచాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల వారిగా 2022–23 ఏడాదికి సంబంధించిన పనులను ఆయన తనిఖీ నిర్వహించారు. వచ్చే సంవత్సరానికి పనులను త్వరగా గుర్తించి, వాటికి సంబంధించిన వివరాలను సేకరించాలన్నారు.

బుక్కాయపల్లె ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు

బుక్కాయపల్లె గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరెడ్డిపై ఆ గ్రామానికి చెందిన కృష్ణయ్య, కోనరామయ్య ఏపీఓకు ఫిర్యాదు చేశారు. బుక్కాయపల్లె గ్రామంలో ఉపాధి హామీ పథకంలో కూలి పని చేయని వారికి కూడా చేసినట్లు రికార్డులో నమోదు చేశారని వారు ఆరోపించారు. ఐదు రోజుల నుంచి కూలీలకు మస్టర్ ఇవ్వలేదని, ఏపీఓ రామచంద్రారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్వర రెడ్డిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ నాగరత్నమ్మ, డివిజనల్ విజిలెన్స్ ఆఫీసర్ యోగానంద రెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, ఏపీఓ రామచంద్రారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎఫ్‌యూ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల

ఏఎఫ్‌యూ : కడపలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్, కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్, అర్బన్ రీజినల్ ప్లానింగ్ విభాగాలకు సంబంధించిన సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. విశ్వవిద్యాలయంలోని సమావేశ మందిరంలో స్క్రీన్ ద్వారా ప్రథమ సెమిస్టర్, తృతీయ సెమిస్టర్, ఐదవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రథమ సెమిస్టర్ కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్‌లో 96 శాతం, మూడోసెమిస్టర్ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ 76 శాతం, మూడోసెమిస్టర్ అర్బర్ రీజినల్ ప్లానింగ్ 80 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. 5వ సెమిస్టర్ కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్‌లో 80 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ఫలితాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ వై. పవన్‌కుమార్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అదనపు అధికారి డాక్టర్ ఇ.సి. సుప్రియ, ఉదయ ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు పరిశీలన


డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న జేసీ గణేష్ కుమార్

జమ్మలమడుగు : పట్టణంలోని పొన్నతోట సమీపంలో ఉన్న డంపింగ్ యార్డును జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ అధికారులతో డంపింగ్‌యార్డు విస్తీర్ణం అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఏడెకరాల స్థలంలో మూడు ఎకరాల నాలుగు సెంట్లలో చెత్త సేకరణ చేసి డంపింగ్ చేయడం, అలాగే మురగునీటిని శుద్ధిచేసేవిధంగా చర్యలు తీసుకుంటున్న తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ జి.శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి సర్వేయర్ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

స్థల పరిశీలన

ఎర్రగుంట్ల : మున్సిపాలిటీ పరిధిలోని దొండపాడు రోడ్డు వలసపల్లి వంక పరిసర ప్రాంతంలో మరుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు సంబంధించి బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ స్థల పరిశీలన చేశారు. మున్సిపల్ కమిషనర్ పి జగన్నాథ్, తాహశీల్దార్ ఎ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న వెంకటకృష్ణారెడ్డి

వల్లూరు : ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకుని అందులో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేయాలని, విద్యార్థులకు సంపూర్ణ విద్యా బోధనను అందించాలని పాఠశాల విద్యా శాఖ ప్రాంతీయ సంచాలకులు మార్తాల వెంకటకృష్ణారెడ్డి అన్నారు. వల్లూరు ఏపీ మోడల్ స్కూల్లో కడప, అనంతపురం , చిత్తూరు, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన 2018 డీఎస్సీ ద్వారా నియతులైన బయాలాజికల్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు జరుగుతున్న ఐదు రోజుల ఇండక్షన్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి లాగా ప్రతి రోజు సబ్జెక్టు మీద అవగాహన పెంచుకుని పాఠ్యాంశాలను బోధించాలని అన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి ధనలక్ష్మి, అసిస్టెంట్ అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రామాంజనేయ రెడ్డి, రీసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

బొలెరో వాహనం ఢీ: యువకుడి మృతి


బాబుద్దీన్ మృతదేహం

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు గ్రామంలో నల్లవాడు వంక సమీపంలో మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో ప్రమాదవశాత్తు బొలెరో వాహనం ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఎస్ఐ రాజగోపాల్ కథనం మేరకు తొండూరు గ్రామానికి చెందిన ప్రసాద్ బొలెరో వాహనం వెల్లాల గ్రామ సమీపంలో ఓ సంస్థ వద్ద బాడుగకు తిప్పుతున్నాడు. పని అయిపోవడంతో తొండూరుకు వెళుతుండగా కొర్రపాడులోని నల్ల వాగు వంకకు సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. అందులో ఉన్న కొర్రపాడు గ్రామానికి చెందిన బాబుద్దీన్, ఇస్మాయిల్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాబుద్దీన్ (22) మృతిచెందాడు. బాబుద్దీన్, ఇస్మాయిల్ ప్రొద్దుటూరులోని మార్టులో పనిముగించుకొని ఇంటికి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. అలాగే ప్రొద్దుటూరు మండలంలోని గోపవరం వద్ద ప్రసాద్ వాహనాన్ని ఓ ఇంటికి తగిలించాడు. ఈ విషయంపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించాడు.

బస్సుపై నిద్రిస్తుండగా కిందపడి..


వి. మల్లికార్జున (ఫైల్)


ప్రమాదవశాత్తు మృతి చెందిన ఆర్టీసి అద్దె బస్సు డ్రైవర్ వి. మల్లికార్జున మృతదేహం

కడప అర్బన్ : కడపలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అద్దె బస్సు డ్రైవర్ వి. మల్లికార్జున(55) ప్రమాదవశాత్తు బస్సు పై నుంచి క్రింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సిద్దవటం మండలం గొల్లపల్లెకు చెందిన వి. మల్లికార్జున కడప డిపో అద్దె బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ప్రతి రోజూ కడప నుంచి తిరుపతికి విధులకు వెళ్లేవాడు. విధులను ముగించుకున్న తరువాత రాత్రి వేళల్లో బస్సును బస్టాండ్ ఆవరణలో పార్కింగ్ చేసి బస్సు టాప్‌పై పడుకునేవాడు. తెల్లవారు జామున లేచి యథావిధిగా విధులకు వెళ్తుంటాడు. ఈక్రమంలో మంగళవారం రాత్రి విధులు ముగించుకుని రోజు మాదిరిగానే బస్సు టాప్‌పై పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో ప్రక్కకు ఒరిగిన సమయంలో ప్రమాదవశాత్తు క్రిందకు బోర్లా పడ్డాడు. ఈ ప్రమాదంలో అతని ముఖానికి తీవ్రగాయాలై రక్తస్రావం ఎక్కువ కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతను క్రింద పడిన సమయంలో ఎవరూ గమనించ లేదు.. బుధవారం తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలో సహచర డ్రైవర్లు గమనించి విషయాన్ని ఆర్టీసీ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. కడప వన్‌టౌన్ ఎస్ఐ రంగస్వామి సంఘటనస్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మద్యం తరలిస్తూ పట్టుబడిన యువకుడు

బి.కొత్తకోట: డ్రైవర్‌గా పనిచేస్తే చాలినంత ఆదాయం రావడంలేదు, ఎలాగైనా డబ్బు సంపాదించాలన్న లక్ష్యంతో అక్రమ మద్యాన్ని కర్ణాటక నుంచి తరలిస్తున్న యువకుడు పోలీసలకు పట్టుబడ్డాడు. ఎస్ఐ కే.రామమోహన్ కథనం మేరకు వివరాలు..పెద్దతిప్ప సముద్రం మండలం కాయలవారిపల్లెకు చెందిన ఎ.నాగరాజు (28) వృత్తిరీత్యా డ్రైవర్. ఇతను ఫార్చ్యునర్ కారును అద్దెకు నడుపుతూ జీవిస్తున్నాడు. డ్రైవర్‌గా రోజూ పనిలేకపోవడం, చాలినంత ఆదాయం లేనందున కర్ణాటక నుంచి మద్యాన్ని అక్రమం కొనుగోలుచేసి పీటీఎం మండలానికి తరలించి విక్రయించుకుంటున్నాడు. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ రామమోహన్ సిబ్బందితో నాయనబావి వద్ద నిఘా వేశారు. నాగరాజు కర్ణాటకలోని రాయల్పాడుతో 288 ప్యాకెట్ల మద్యాన్ని బాక్సుల్లో వేసుకుని మొటుకుపల్లె నుంచి నాయనబావికి వస్తుండగా పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. తప్పించుకునేందుకు ప్రయత్నించినా వీలు కాలేదు. కారులో తనిఖీలు చేయగా కర్ణాటక మద్యం గుర్తించి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కారును సీజ్ చేసి నిందితుడు నాగరాజును అరెస్ట్‌చేసి మంగళవారం కోర్టుకు తరలించామని ఎస్ఐ చెప్పారు. నాగరాజుపై కర్ణాటకలోని ఆర్‌టీ నగర్ పోలీస్ స్టేషన్‌లో గంజాయి కేసు నమోదైనట్లు తెలిపారు.